కథ

# ఇగురం

భాగ్యరేఖ

చెప్పుల సప్పుడైతె బైటికి తొంగి సూశింది లచ్చిమక్క. మల్రెడ్డొచ్చిండు.

"ఏం జేస్తున్నవ్ చిన్నీ" అడ్గిండు లోపలి కొచ్చుకుంట.

"ఇప్పుడె ఇంటెన్క బట్టలు నానవెట్టొచ్చిన బిడ్డ!జెరైనంక విండుదామనీ!"

"నీ...యమ్మ! ఇంత ఏజైనంక నీకెందుకె బట్టలుత్కుడు, బాసన్లు దోముడూ... ఓ పన్మన్శిని వెట్టుకుంటే మాయె? ఒంద రూపాలకొచ్చినాది!"

"ఏ...పైసలకోసమార! నువ్వు! ఆల్లేంబాగ విండి సస్తరు? సబ్బు నీల్లల్ల నాని నాని కొట్కపాయె. తట్టెడు సర్ఫేశి గాలవెడ్తరు. నీల్లు దొబ్బ దొబ్బ ఒల్కవోస్తరు. పోతెవాయె అన్కిట్కి కన్లు మూస్కుందామంటె బట్టల మైలవోకపాయె. తూ... పాడువడ కొత్త బట్టలు గూడ నాల్రోజులకె గుడ్డికాయవారి ఇడ్శిన బట్టలోలె ఇకారంగ తయారైతయి. బాసన్ల సంగతైతె ఇగ జెప్పనేఒద్దు. ఏడి పాసు ఆడనె మల్లదోంకోక దప్పకపాయె. ఏం పనిమన్శులురా పాస్మల్లె పనిమన్శులూ..."

"మరిగ చాతగాని పొద్దొస్తె ఏంజేస్తమే?" అన్నడు.

"ఇగ అప్పుడైతె దస్పదనుకో...అయినా అసుంటి దినాలు రాగూడదనే దినాం...దేవున్కి మొక్కుతున్నరా!"

ఇట్ల మా కాల్జేతులాడదంగ, మా పన్లు మేం జేస్కోంగనే మమ్ల గొంటవొమ్మని ఆ పర్మాత్మను లేస్త కూసుంట మొక్కుతున్న కొడ్క. ఏం జేస్తడో... మమ్ల నెట్ల గొంటవోతడో ఆయ్న దయ" రొండు చేతులెత్తి మొక్కింది.

సంచిలకెల్లి టిపిని డబ్బ దీశి లచ్చిమక్కకిచ్చిండు.

మల్లేం దెచ్చినవురా?" మూత దీస్కుంట అడిగింది.

"ఏంలే...జెరంత కూర దెచ్చినే"

"ఏ... ఎందుకు దెచ్చినవురా? ఐతారం ఐతారం దెప్పిచ్చి ఒండుతనే ఉన్న. ఈ ముసల్తనంల మాంసాల్దిని ఏ కష్టం జెయ్యవొయ్యేదుంది...?" అనుకుంట మల్రెడ్డి దిక్కు జూశింది.

"ఏంది బిడ్డ! మొకం గుంజుకపోయింది?"

మల్రెడ్డి మొకం న్యాలకేశి గూసుండు. సప్పుడు జెయ్యలె.

"ఏంది కొడ్కా...ఏందో పికర్ జేస్తున్నవూ... నాకు జెప్పగూడన్ది ఏముందిరా...? బార్తి బాగుందా?" లచ్చిమక్క గొంతు జెర చిన్నగ జేశి పరెశానైకుంట అడ్గింది.

"దానిగురించే గద చిన్నీ నాకన్న బాదంతా! పువ్వోలె వెంచి ఉన్నొక్క పిల్లను దీస్కపొయ్యి ఆ అడ్డమైన కొంపలేస్తి.

"మల్ల ఏమన్న తగాద జేశిన్రా?"


"ఉట్టి తగాదలు ఎన్ని జేశినా తశివ జేశి తెంపొచ్చు గని... పిల్లను మల్ల గొట్టి దోలిన్రు చిన్నీ! ఆల్లమీద మన్నువడ"

"ఆఁ... పిల్లను గొట్టినారు? ఆల్ల చేతులకు జెట్టలు వుట్ట. మల్లేం రోగమొచ్చెనంట?"

"ఇంకేం రోగం... చాతగాని రోగం. సదువు మాముల్గ సదివినా, ఆర్టీసీల కొల్వుండు, ఇంత పొలమున్నది, ఒక్కడే కొడ్కుగదాని పిల్లనిస్తిమి.

ఉట్టి ఉద్యోగంల ఏమొస్తయి ఏదన్న బిజినెస్ వెట్టుకుంటనని ఒద్దనంగ పట్టు వట్టె... పోని తియ్... మంచిగ సంపాయిస్తె మన పిల్లనే సుకపడ్తది గదనని...పిల్ల పేర్మీద బ్యాంకు లేశిన. లక్ష రూపాల్దీశి చేత్ల వెట్టొస్తిమి. అవి ఆయిన్ని ముండమోపె. మీదంగ...ఏమన్కుంట ఇచ్చిండో మీ నాయ్న, అంత లాసొచ్చిందని అట్ల పిల్లను నల్చె. మ...ల్ల ఇది జేస్త అది జేస్తనంటె పిల్లగాడు ఉట్టిగ దిర్గుతె ఆవారగైతడు మనకే ఇకారమని అప్పుడిన్ని ఇప్పుడిన్ని... దెగ్గెర దెగ్గెర మల్లొక లక్ష సదిర్తి. అవ్వీ... దిగమింగె. మ...ల్లిపుడు పైనాన్సు వెడ్త మల్ల పైసల్దెమ్మన్నడంట. లక్షల్లక్షలు ఆల్లతాన ఎక్కడికెల్లి ఒస్తయి, ఇపడ్కె మస్తుగిచ్చిన్రు సాలలేదా? అని పిల్ల అడిగిందని...

ఒక్క తీర్గ గొట్టలే చిన్నీ! పెయి నిండ వాతల్దేలినయ్, మొకమంత వాశింది. చాంది



నాలసంది అప్పుడప్పుడు గొడ్తనే ఉన్నరంట... నా తల్లి! మనం బాదవడ్తమని బూదేవి లెక్క ఎంత ఓర్సుకున్నదో... ఈసారి తాలక ఈడవడ్డదా కొచ్చింది. నీకు దెల్షి నేనెవర్కన్న అన్యాయం జేశినానె చిన్ని! నాకే ఇంత కష్టమెందుకు వెట్టిండు బగవంతుడు" కండ్లల్ల నీల్లు దిప్పుకున్నడు మల్రెడ్డి.

"నాయమ్మ! బంగారమసుంటి బిడ్డె. దాని అదుష్టంల ఇట్ల రాశిండేంరా దేవుడూ... మరెట్ల జేస్తనంటవ్రా?"

"చేశేదేముంది చిన్నీ! మల్లిన్ని పైసల్దీస్క పొయ్యి, మన్సు

రాయి జేస్కోని పిల్లనాడ దొంచొస్త"
లచ్చిమక్కకు ఉల్కిపడ్డట్టయింది.
"పిల్లేమంటుంది రా! మరీ..."
"మల్ల వోనంటె పోనంటుంది గని...ఆడివిల్లాయె కష్టమొ...నుకమొ...పోక దప్పుతదా"
"మరి పిల్లకిష్టం లేనప్పుడు సావుమని తోలిస్తవా?"
"అట్లంటెట్ల చిన్నీ! ఆడ కష్టముందని ఇంట్ల వెట్టుకుంటమా! పెండ్లయిన ఆడివిల్లను?"
"లే...ఆల్లు సంపుతె దెచ్చి బొందల వెట్కుంటుము" కస్సున లేశింది లచ్చిమక్క.
"లేకుంటేందిరా! పిల్లను తెల్చి తెల్చి మల్లా నర్కంలేస్తనంటవూ... పిల్లగాడు చాతగానోడని తెల్చేపాయె... ఆడు పిల్లనన్న మంచిగ సూస్కుంటుండా అంటే ఆడు, ఆని అమ్మ, అయ్య అందరు పసువులని దెల్చేపాయె. ఇంకేం సచ్చిందిరా ఆ యింట్ల... బంక...! నువ్వు లచ్చ ఇయ్యి, కోటియ్యి ఇగ బాయిల వోశినట్టే. పిల్ల పానాన్కి గూడ ముప్పే. మనకు పిల్ల, దాని పానం ముక్యం..."
"అట్ల మనమన్కుంటం గని...లోకం" మద్యలో అందుకోవోయిండు మల్రెడ్డి.
"నీ... లోకం మీద మన్నువొయ్య! లోకానికి బయపడి ఇయ్యాల పిల్లనాడ దోలొస్తె... రేపు మస్సిరిగి పిల్లనే... ఏమన్న జేస్కునే... ఆల్లె దాన్నెమన్న జేశిరీ...ఏ లోకమడ్డమొస్తదిరా? చెట్టంత పిల్లవోతె లోకం దెచ్చిస్తాదిరా? నీ దిమాకెక్కడ పన్జేస్తుందిరా మల్రెడ్డీ..."
జెరాగి మల్రెడ్డందుకున్నడు.
"ఔవే చిన్ని! ఇయ్యాలంటె పిల్లను మేం నడ్పుతం. రేపు మేం సచ్చినంక ఎవర్సూస్తరు దాన్ని? దాని బత్కు ఆగం గాదే!"
"అయ్యో! ఏ కాలంలున్నవురా పిల్లగా? దాన్సొంకరు నడ్పేదేందిరా? అంతో ఇంతో సదువుకున్నది పన్నెండోద్దాక. కాలేజికి వంపు...పైకి సద్వి పియ్యి. రేపు దాని పొట్టకు బట్టకే గాదు. ఇంక పదిమందిని నడ్పనీకే సరిపోను సంపాయిస్తది. దాని కాల్లమీద అది నిలవడ్తది. ఆనాడె అది పెండ్లొద్దు గిప్పుడే... డిగ్రి సదువుతనంటె ఇనకపోతివి. ఆ సారు గూడ తనంతల తనే నీ ఇంటి కొచ్చి, పిల్లకు అన్నిట్ల తొంబైమీద మార్కులొచ్చినయ్ డాక్టర్ సదువు సదివిపిస్తె తప్పక సీటొస్తదని ఒక్క తీర్గ జెప్పిపాయె. మంచి సంబందం మంచి సంబందం అన్కుంట..నీకు ఉచ్చ నిల్వక పాయె" జెర దమ్ము దిని మల్లందుకుంది లచ్చిమక్క.
"తెల్వక ఒపారి తప్పు జర్గిపొయ్యింది. తెల్చి మల్ల తప్పుజెయ్యకు కొడ్కా... అన్యాయం జరిగినపుడు ఆడి విల్లకు అమ్మగారి అండ కొండంత బలం బిడ్డా. మొగోన్ని గద ఏం జేశిన నడుస్తదంటనని అనుకున్నడేమొ. ఆన్కి గూడ చెప్పుతోటి గొట్టినట్టయితది".
నేన్జెప్పేది జెప్పిన ఇగ నీ ఇష్టమన్నట్టు ఊకుంది లచ్చిమక్క. కూసోని కూసోని లేశిండు మల్రెడ్డి.
"పోతున్న చిన్నీ! పోత పోత ఆ సార్‌ను కల్సు కుంటవోత. ఎట్ల, ఇది జూన్ నెలనే, పిల్లను ఏ కాలేజిలేస్తె బాగుంటదో కనుక్కుంట వోత".
లచ్చిమక్క పానం నింబడమైంది. ●

## ఆదివారం క్విజ్

### కళలు

1. హ్యారీ పోట్టర్ సిరీస్‌లో భాగంగా ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణ పొందుతున్న చిత్రం పేరేమిటి?

### పోటీలు

2. మిస్ యూనివర్స్ 2004 గా ఎంపికైన యువతి పేరేమిటి? ఏ దేశస్థురాలు?

### భూగోళం

3. ప్రపంచ పటంలో నిలువుగా కనిపించే ఊహారేఖలను ఏమంటారు?

### విజ్ఞాన శాస్త్రం

4. నవ్వు పుట్టించే వాయువు అని దేనికి పేరు?

### ఆధ్యాత్మికం

5. నవగ్రహాలకు ఒకే ప్రాంగణంలో విడివిడిగా దేవాలయాలు ఉన్న రాష్ట్రమేది?

## సమాధానాలు వచ్చేవారం

### గతవారం ప్రశ్నలకు సమాధానాలు

1. పాప్‌గాయని మడొన్నా పిల్లల కోసం ప్రచురించిన పుస్తకం పేరు **ఇంగ్లీష్ రోజస్.**
2. 'మౌని బాబా'గా సుప్రసిద్ధులైన 102 ఏళ్ల స్వామీజీ ఇటీవల అలహాబాద్‌లోని ఆలయ నివాసంలో కన్నుమూశారు. ఆయన అసలు పేరు **స్వామి రామ్ నరేశ్ దాస్. ఆయన హనుమంతుని వీరభక్తుడు.**
3. భారత్‌లో పోలియో నిర్మూలనకు ఉద్దేశించిన 'పల్స్ పోలియో' పథకం నిర్వహణకు, ప్రచారానికి నిధులు అందజేస్తానని తాజాగా ముందు కొచ్చిన దేశం **జపాన్. ఆ దేశం రూ.32 కోట్లు ఆర్థిక సహాయం చేస్తోంది. ఈ మేరకు భారత్‌లో జపాన్ రాయబారి యసుకుని ఇనొకి ఒక ఒప్పందంపై సంతకం చేశారు.**
4. ఇటీవల మరణించిన రొనాల్డ్ రీగన్ ఆమెరికాకు రెండు పర్యాయాలు అధ్యక్షునిగా ఉన్నారు.
5. సౌర కుటుంబంలో అన్నిటికన్నా పెద్దది, ఎక్కువ కాంతి మంతమైనది అయిన గ్రహం గురుగ్రహం.

## శక్తినిచ్చే ఆహారం

**రిబోఫ్లేవిన్:** ఇది పిండిపదార్థాలను శక్తిగా మార్చుతుంది. పాల ఉత్పత్తులు, గుడ్లు, కాలేయం, కోడి మాంసం, చేపలు, తాజా ఆకు కూరలు, పప్పుల్లో రిబోఫ్లేవిన్ ఉంటుంది.
**విటమిన్ బి6:** శక్తినిచ్చే జీవరసాయన చర్యకు ఇది తప్పనిసరి. చేపలు, కాలేయం, ధాన్యం, కోడిమాంసం, గుడ్లు, పప్పులు, బీన్స్ విటమిన్ బి6ని సమృద్ధిగా అందిస్తాయి.
**విటమిన్ బి12:** ఎర్రరక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. దేహమంతటికీ ఆక్సిజన్ సరఫరా అవడానికి ఎర్రరక్త కణాలు అవసరం. పంది మాంసం, పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం వంటి పదార్థాలలో బి12 ఉంటుంది.
**విటమిన్ ఇ:** ఒత్తిడిని తగ్గిస్తుంది. శాకాహార నూనెలు, సోయాబీన్, తాజా కాయకూరలు దీనిని పుష్కలంగా అందిస్తాయి.
**జింకు:** కండరాల నొప్పులకు ఉపశమనం కలిగిస్తుంది. మాంసం, కాలేయం, గుడ్లు, బీన్స్ ద్వారా దీనిని సంగ్రహించవచ్చు. ◆